# శ్రీ షిరిడీ సాయి వైభవమ్



శ్రద్ధ　　　　　　　　సబూరి



సాయిదర్బార్, హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయిబానిస శ్రీరావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్

సంచిక 1 - డిసెంబరు,2017

## బాబా పవిత్రం చేసిన రూపాయి

మనకు శ్రీసాయి సత్ చరిత్ర 29వ.అధ్యాయంలో డా.విర్ హాటేకు బాబా ఇచ్చిన రూపాయ గురించిన ప్రస్తావన వస్తుంది. దాని గురించి మరికొంత వివరణ.

కాప్టెన్ హాటేకు బాబా అంటే ప్రగాఢమయిన భక్తి. అతను షిరిడీలో కొంత కాలమున్న తరువాత గ్వాలియర్ కి తిరిగి వచ్చాడు.

ఒకరోజు గ్వాలియర్ లోనే ఉండే సావల్ రామ్ అనే అతను హాటే వద్దకు ఎంతో ఆందోళనపడుతూ వచ్చి తన కొడుకు కనపడటంలేదని చెప్పాడు. అప్పుడు డా.హాటే, "షిరిడీ వెళ్ళి బాబా దర్శనం చేసుకో. నీ కొడుకు తప్పక దొరుకుతాడు" అని చెప్పాడు. సావల్ రామ్ అలాగే చేసుకుంటానని చెప్పాడు. ఆ తరువాత కొంత కాలానికి అతని కొడుకు వద్దనుంచి ఉత్తరం వచ్చింది. అందులో "తాను ఈజిప్ట్ లో ఉన్నానని, తల్లిదండ్రులు కోపగిస్తారనే ఉద్దేశ్యంతో ముందు చెప్పకుండా రహస్యంగా సైన్యంలో చేరానని" వ్రాసాడు. ఇప్పుడు తాను భారతదేశానికి తిరిగి వస్తున్నానని రాసాడు. సావల్ రామ్ ఆనందానికి అవధులు లేవు. కాని షిరిడి వెళ్ళలేదు. సావల్ రామ్ భార్యతో కలిసి కొడుకును తీసుకుని రావడానికి బొంబాయి వెళ్ళాడు.

కొడుకును చూడగానే సావల్ రామ్ చాలా ఖిన్నుడయ్యాడు. కొడుకు చిక్కి శల్యమై తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ ఉన్నాడు. వెంటనే వైద్యం చేయించడానికి కొడుకును వెంటబెట్టుకుని గ్వాలియర్ వచ్చాడు. ఈ విషయాన్నంతా డా.హాటేకి చెప్పాడు. వైద్యం చేస్తున్న వైద్యుడు సావల్ రామ్ ని బాగా చీవాట్లు పెట్టాడు. "నువ్వు నీ మాటను నిలబెట్టుకోలేదు. ముందర కొడుకుని షిరిడీ తీసుకొని వెళ్ళి బాబా దర్శనం చేయించు. అబ్బాయి ఆరోగ్యవంతుడవుతాడు" అన్నాడు. భార్యాభర్తలిద్దరూ కొడుకుతో షిరిడీకి ప్రయాణమయ్యారు. వారు బయలుదేరబోతుండగా డా.హాటే, సావల్ రామ్ కి ఒక రూపాయినిచ్చి, "ఈ రూపాయను బాబా చేతిలో పెట్టు. తిరిగి ఆరూపాయను తీసుకురావడం మర్చిపోకు" అని మరీ మరీ చెప్పాడు. బాబావారు ఆ రూపాయను తాకి పవిత్రం చేసిన తరువాత దానిని తన పూజా మందిరంలో పెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో ఇచ్చాడు.



సావల్ రామ్ కుటుంబమంతా షిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకున్న తరువాత తిరిగి గ్వాలియర్ చేరుకున్నారు. డా.హాటే ని కలుసుకుని తన కుమారుడు కోలుకుంటున్నాడని చెప్పాడు. బాబా గారి నుంచి తిరిగి తీసుకున్న రూపాయను కూడా ఇచ్చాడు. డా.హాటే ఆ రూపాయను తీసుకున్నాడు, కాని అది తాను ఇచ్చిన రూపాయ కాదని చెప్పాడు. చాలా నిరాశకు గురయ్యాడు. మళ్ళీ తిరిగి షిరిడీ వెళ్ళి బాబానుంచి తాను ఇచ్చిన రూపాయను తిరిగి తీసుకురమ్మని సావల్ రామ్ తో చెప్పాడు. సావల్ రామ్ ఇంటికి వచ్చి భార్యతో జరిగినదంతా చెప్పాడు. అప్పుడామె లోపలికి వెళ్ళి తాను భద్రంగా దాచిన డా.హాటే ఇచ్చిన రూపాయను తీసుకుని వచ్చింది. ఆ మరుసటి రోజు సావల్ రామ్, డా.హాటేకు ఆ రూపాయను అందచేశాడు. బాబా తాకి పవిత్రం చేసిన ఆరూపాయను ప్రసాదంగా అందుకున్న డా.హాటే ఎంతో ఆనందాన్ని పొందాడు. రూపాయ ఇవ్వడంలో జరిగిన పొరపాటును వివరించి సావల్ రామ్ క్షమాపణ కోరాడు. జరిగిన విషయం విని డా.హాటే తృప్తి చెందాడు

(సర్వం శ్రీసాయినాధార్పణమస్తు)

## తన భక్తుని బాధను బాబా అనుభవించుట

బాబా తన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వాటిని నివారిస్తూ ఉండేవారు. ఆఖరికి ఒక్కొక్కసారి తన భక్తులకు వచ్చే అనారోగ్యాలను కూడా ఆయన స్వీకరించి తన భక్తులను కాపాడేవారు. అంతే కాదు ఆయన చేసే వైద్యం కూడా చాలా విచిత్రంగా ఉండేది.

బాబా తన భక్తులపై చూపించే ప్రేమకు సాటి మరొకటి లేదు.అటువంటి సంఘటన గురించి తెలుసుకుందాము



1915 వ.సంవత్సరంలో బాపూసాహెబ్ బుట్టీ 104 డిగ్రీల జ్వరంతో బాధ పడ్డాడు. జ్వర తీవ్రత వల్ల బాగా నీరసించిపోయి బాబా దర్శనానికి ద్వారకామాయికి కూడా వెళ్ళలేకపోయాడు. బాబా అతనిని ఎవరి సహాయంతోనైనా రమ్మని కబురు పంపించారు. నీరసంగాఉన్నా బుట్టీ మరొకరి సహాయంతో బాబావద్దకు వచ్చాడు. బాబా అతనిని కూర్చోమని చెప్పి బాదంపప్పు, అక్రోటు, జీడిపప్పు, కిస్ మిస్ వేసిన పాయసం, తన సమక్షంలో తినిపించారు. భోజనం అయిన వెంటనే బుట్టీని తన బసకు తిరిగి వెళ్ళి విశ్రాంతి తీసుకోమన్నారు. ఎటువంటి మందులు వాడకుండానే అతని జ్వరం తగ్గిపోయింది. అదే సమయంలో బాబాకు జ్వరం వచ్చింది. కాని బుట్టీకి నయమవగానే బాబాకు కూడా జ్వరం తగ్గిపోయింది.

ఆవిధంగా బాబా బుట్టీకి వచ్చిన జ్వరాన్ని తాననుభవించి బుట్టీకి నయం చేశారు.

## *అమృత గుళికలు*

*శ్రీ రాధాకృష్ణ స్వామీజీ బెంగళూరులో 'సాయి స్పిరిట్యువల్ సెంటర్' వ్యవస్థాపకులు. ఆ సెంటర్ ను స్థాపించిన కొన్ని సంవత్సరాల తరువాత, శ్రీసాయి సాక్షాత్తు శ్రీరామ చంద్రులవారే అని తన భక్తులకు నిరూపణ చేసే అవకాశం ఆయనకు లభించింది. ఒకరోజు మందిరానికి ఒక సన్యాసి వచ్చాడు. ఆయన స్వామీజీని "బాబా మానవమాత్రుడే కదా. మరి అటువంటపుడు బాబాని భగవంతునిగా ఎందుకని పూజించాలో నిరూపించమని" ప్రశ్నించాడు. స్వామీజీ యిచ్చిన వివరణ ఆ సన్యాసిని*

ఒప్పించలేకపోయింది. అపుడు స్వామీజీ మనసులోనే బాబాని ప్రార్థించారు. కొన్ని నిమిషాల తరువాత ఒక స్త్రీ, రామ, లక్ష్మణ సీత, మారుతి విగ్రహాలను తీసుకుని వచ్చి ఆ సన్యాసి సమక్షంలో స్వామీజీకి భక్తిపూర్వకంగా సమర్పించుకుంది. ఆ సంఘటన సన్యాసికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. బాబాయే శ్రీరామచంద్రమూర్తి అన్న స్వామీజీ యిచ్చిన వివరణకి సాక్ష్యం లభించింది. ఆ సన్యాసి కన్నీరు కారుస్తూ సాయిబాబా గొప్పతనం గురించి శంకించినందుకు స్వామీజీని క్షమాపణ వేడుకొన్నాడు. ఆ ప్రతిమలను ఎక్కడినుంచి తీసుకుని వచ్చావని స్వామీజీ ఆ స్త్రీని ప్రశ్నించారు. తాను వాటిని మద్రాసులోని ఆల్ ఇండియా సాయి సమాజ్ నుండి తీసుకుని వచ్చానని చెప్పింది. దీనికి ఇంకా నీకు సాక్ష్యమేమన్నా కావాలా ” అన్నట్లుగా స్వామీజీ చిరునవ్వుతో ఆ సన్యాసి వంక చూసారు.



# షిరిడీ వార్తలు



## సాయిబాబాకు రూ.32 కోట్లు విరాళం

షిరిడీ సాయినాధునికి భక్తులు ఖరీదయిన బంగారం, వెండి, వజ్ర, వైఢూర్యాలు కానుకలుగ సమర్పించడం మనకు తెలిసిన విషయమే. కాని ఒక భక్తుడు ఏకంగా రూ.32 కోట్లు విలువచేసే రెండు భవనాలను సాయిబాబా సంస్థాన్ కు కానుకగా అందచేసాడు. సంస్థాన్ చరిత్రలోనే రెండు అతి పెద్ద కానుక ఇదే కావడం విశేషం. ముంబాయికి సమీపంలోని పాల్ఘార్ జిల్లా వసాయ్ తాలూకా కోపరికి చెందిన కాశినాధ్ గోవింద్ పాటిల్ మే నెల 11వ.తేదీన సంస్థాన్ సభ్యుల సమక్షంలో రిజిస్ట్రేషన్ పత్రాలను అప్పగించారు. అంతకుముందే మద్రాసులోని సాయి భక్తులు శ్రీ రమణిగారు, షిరిడీలో యాత్రీ నివాస్ ను నిర్మించి, భక్తుల సౌకర్యార్ధం సంస్థానానికి అప్పగించారు.

## షిరిడీ 'క్లీన్ సిటీ' అవార్డు

క్లీన్ సిటీగా దేశంలోనే 56వ.స్థానం పొందిన షిరిడీ, మహారాష్ట్రలో 4వదిగా ఎంపికైంది.

**కాకాసాహెబ్ దీక్షిత్ డైరీ శ్రీమతి హెతాల్ పాటిల్ రావత్ గారి బ్లాగులో ఆంగ్లంలో ప్రచురింపబడింది. దీనికి తెలుగు అనువాదం చేసుకోవడానికి ఆమె దయతో అంగీకరించారు. వారికి నాకృతజ్ఞతలు తెలుపుకొంటు, బాబా వారు ఆమెకు ఆమె కుటుంబానికంతటికి శుభాశీస్సులు అనుగ్రహించమని కోరుకొంటున్నాను.**

నూతనముగా సాయి మార్గములో ప్రవేశించిన సాయి భక్తులకు క్రింద తెలిపిన సాయిబానిస గారి పుస్తకములు ఎంతగానో తోడ్పడతాయనడంలో ఎటువంటి సందేహము లేదు.

శ్రీ సాయిబానిస గారి రచనలు

శ్రీ సాయి పుష్పగిరి

శిఖరాలు - లోయలలో శ్రీ సాయి

(శ్రీ సాయి సత్ చరిత్రపై సాయిబానిస ఆలోచనlu

శ్రీ సాయి మందార మకరందాలు

ఈనాటి సమాజములో మానవత్వము

ఇంకా బ్రతికే ఉంది

ఆనాటి ఋషులు - నేటి షిరిడిసాయి

పుస్తకములు కావలసినవారు saidarbar@gmail.com కు మీ చిరునామాతో సహా మైల్ ఇచ్చినచో పుస్తకముల ఖరీదు, కొరియర్ చార్జీలు ఎంతపంపవలెనో తెలియచేయబడుతుంది. దాని ప్రకారం మీరు ఆన్ లైన్ ద్వారా డబ్బు పంపించగానే పుస్తకములు పంపబడును.

# కాకాసాహెబ్ దీక్షిత్ డైరీ – 1



పరిచయం:

శ్రీ షిరిడీ సాయిబాబావారి నామమే శాంతిని పొందగోరేవారి హృదయాలకు ఎంతో శాంతిని కలుగజేస్తుంది. ఆయన కర్మ భూమి షిరిడీ. బాబా సశరీరంగా షిరిడీలో 60 సంవత్సరములపాటు జీవించారు. ఈ కాలంలో శ్రీమాధవరావు దేశ్ పాండే, (శ్యామా), శ్రీమహల్సాపతి, శ్రీ గోవిందరావు ధబోల్కర్ (హేమాడ్ పంత్) శ్రీ నానాసాహెబ్ చందోర్కర్, శ్రీ బీ.వీ..దేవ్, శ్రీ హరి సీతారాం దీక్షిత్ (కాకా సాహెబ్ దీక్షిత్), శ్రీ జీ.ఎల్. కపర్దే లాంటి భక్తులు, యింకా ఎంతోమంది భక్తులు శ్రీసాయి మహరాజ్ తో ఆధ్యాత్మిక అనుబంధాన్ని పెంపొంధించుకున్నారు. మొదటి యిద్దరూ తప్ప మిగతావారందరూ కూడా విద్యావంతులు. సంఘంలో మంచి పేరు ప్రతిష్టలు కలిగి తమ తమ వృత్తులలో చక్కగా రాణించి ధనవంతులయ్యారు. శ్రీసాయి మహరాజ్ చిరిగిన బట్టలు ధరించినప్పటికీ, పడిపోతున్న మసీదులో నివసించుతున్నప్పటికీ, శ్రీసాయిబాబాతో వారి మధ్య ఉన్న బంధం సముద్రపు లోతు ఎంతగా ఉంటుందో అంత గాఢంగా పెనవేసుకు పోయింది. విజ్ఞానదాయకమైన తమ మాటలతో ఎంతోమంది చరిత్రను వ్రాశారు. ఈనాటి భక్తులకి ఈ చరిత్ర ద్వారా ఎన్నో విషయాలను తెలుకుకోవడానికి సహాయకారి అయింది. షిరిడీలో జరిగే చాలా సంఘటనలను క్రోడీకరించి "శ్రీసాయి సత్చరిత్ర" పేరుతో శ్రీ షిరిడీసాయి బాబావారి జీవిత చరిత్రను వ్రాసే బాధ్యత శ్రీహేమాడ్ పంత్ కు యివ్వబడింది. శ్రీ హేమాడ్ పంత్ ఈ కార్యబారాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆయన వ్రాసిన సత్ చరిత్ర ఈనాడు సాయి భక్తులందరికీ ప్రముఖ పారాయణ గ్రంధంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

శ్రీసాయిబాబా గారు జీవించి ఉన్న కాలంలో జరిగిన దైవిక సంఘటనలన్నిటినీ సేకరించి శ్రీ హరిసీతారాం దీక్షిత్ (కాకా సాహెబ్ దీక్షిత్) యొక్క "కాకా సాహెబ్ దీక్షిత్ డైరీ" నేడు మనకు లభించిన విలువైన సంపద.

సాయిబాబా, దీక్షిత్ ని ప్రేమతో "లంగ్డాకాకా అని పిలుస్తూ ఉండేవారు.  కాకా సాహెబ్ దీక్షిత్ బాబా వారి ఆజ్ఞలను ఎంతో విధేయతగా అమలు పరుస్తూ ఉండేవారు.

కాకా సాహెబ్ దీక్షిత్:

శ్రీసాయిబాబాను సన్నిహితంగా సేవించిన భక్తులలో యిద్దరు మాత్రమే బాబాతో తమకు గల అనుభవాలను గురించి డైరీ వ్రాసుకున్నారు.  వారు శ్రీ జీ.ఎస్. ఖపర్డే, శ్రీకాకాసాహెబ్ దీక్షిత్.  ఖపర్డేగారి షిరిడీ డైరీ చాలా మంది సాయి భక్తులకు సుపరిచితమే.  శ్రీఖపర్డే ఆంగ్లంలో వ్రాసుకున్నా, డైరీని మొదట శ్రీ బీ.వీ.నరసింహస్వామిగారు ప్రచురించారు.  తరువాత అది సాయిలీల పత్రికలో 1985-86 మధ్య కాలంలో ధారావాహికంగా ప్రచురింపబడి ఇపుడు షిరిడీసాయి సంస్థానం వారి వద్ద పుస్తక రూపంలో లబిస్తుంది. కాని, కాకా సాహెబ్ దీక్షిత్ డైరీ మాత్రం చాలామంది సాయి భక్తులకు ముఖ్యంగా తెలుగువారికి అలభ్యంగానే ఉంది.  శ్రీ దీక్షిత్ తన డైరీని మరాఠీ భాషలో వ్రాసుకొన్నారు.  ఆ డైరీలో తాను 1909 లో బాబాను దర్శించినది లగాయతు బాబా మహాసమాధి చెందేంతవరకు, ఆ తరువాత 1926 లో ఆయన మరణించేముందు దాకా కూడా తాను చూచిన, విన్న బాబాలీలలను వ్రాసుకొన్నారు.  ఆ డైరీయొక్క ఆంగ్లానువాదం మద్రాసునుండి చాలాకాలం క్రితం ప్రచురింపబడింది.  కాని, ఆ పుస్తకం ఇప్పుడు లభ్యం కావడంలేదు.  బాబాను ప్రత్యక్షంగా సేవించిన ఎస్.పీ.అవస్తే గారివద్దనుండి ఆపుస్తకం ఒక ప్రతి పూనాకు చెందిన శ్రీ ఎస్.ఏ.ఎం.గాడ్గే అనే సాయిభక్తునికి లభించింది.  అక్కడక్కడ చెదలు తిని మొదట, చివర రెండు పేజీలు పూర్తిగా చిరిగిపోయివున్న ఆ పుస్తకాన్ని 1977లో శ్రీ గాడ్గే శ్రీసాయిలీల ఎడిటర్ దృష్టికి తీసుకొని వచ్చారు.  చిత్రమేమిటంటే శ్రీషిరిడీ సాయి సంస్థానం వారి అనుమతితో ఆ డైరీని ఆగ్లంలోనికి అనువదించి ప్రచురిస్తునట్లుగా ఆపుస్తకం ఉపోద్ఘాతంలో అనువాదకుడు వ్రాసి వున్నా ఆపుస్తకం మరొక ప్రతి సంస్థానం గ్రంధాలయములో కాని, మరెక్కడా గాని లభించలేదు.  మొదట, చివర పేజీలు చిరిగిపోయి ఉండటం వల్ల ప్రచురణ కర్తకు సంబంధించిన వివరాలు తెలియలేదు.  సుమారు 160 పేజీలు ఉన్న ఆడైరీలో 121 వివిధ

---

సంఘటనలు, బాబా లీలలు గురించి వ్రాయబడి ఉంది. అవి ఎంతో ఆసక్తిదాయకమైనవే కాక శ్రీసాయి చరిత్రను గురించి ఎన్నో కొత్త విషయాలు వెలుగులోనికి తెస్తాయి.

(ఇంకావుంది)

## సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారు రచించిన ఆనాటి ఋషులు – నేటి షిరిడీ సాయి నుండి...

## సనాతన ధర్మంలో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఆనాటి ఋషులు, ఈనాటి కలియుగములోని షిరిడీ సాయి

సనాతన ధర్మములో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఋషులు, మునీశ్వరులు నడిచిన మార్గములో ఈ కలియుగములో శ్రీ షిరిడీ సాయినాధులువారు కూడా నడిచారు అని చెప్పడానికి ప్రయత్నించుచున్నాను. నేను ముఖ్యముగా 1. కణ్వమహర్షి, 2. దధీచి మహర్షి, 3. చ్యవన మహర్షి, 4. కపిలమహర్షి, 5. అష్టావక్ర మహర్షి, 6. ఋష్యశృంగ మహర్షి, 7. గౌతమ మహర్షి, 8. ఆపస్తంబ మహర్షి, 9. అగస్త్య మహర్షి, 10. దత్తాత్రేయ మహర్షి, 11. విశ్వామిత్ర మహర్షి మరియు ఈ కలియుగములో శ్రీ షిరిడీ సాయినాధులు. వీరి జీవతాలలోని సామీప్యాలను చూడగలిగాను. అందుచేతనే ఈనాడు మనము షిరిడీ సాయినాధులవారిని “రాజాధిరాజ యోగిరాజ” అని పిలుచుకొని వారు చూపిన సాయిమార్గములో అడుగులు వేస్తున్నాము.

1. కణ్వ మహర్షి : మేనక విశ్వామిత్రుల కుమార్తె శకుంతలను పెంచి పెద్దచేసి వివాహము అనంతరము అడపిల్లకు చేయవలసిన ముద్దుముచ్చటలు అన్ని జరిపించి సంసార బాధ్యతలన్నిటిని పూర్తి చేసెను.

శ్రీ సాయి : తన భక్తురాలు బయిజాబాయి మరణానంతరము ఆమె కుమారుడు తాత్యాకోతే పాటిల్ ను పెంచి పెద్ద చేసెను. వివాహము చేయించెను. అతని తండ్రి మరణానంతరము తాత్యాను ఇంటిలోనే నిద్రించమని చెప్పెను. తాత్యాను అల్లుడు, బయిజాబాయిని అక్క అని మిగతావారిని తమ్ముడు అని వరసలతో సంసార బంధాలు అనుభవించెను.

2. దధీచి మహర్షి : దేవతలకు రాక్షసులకు మధ్య జరుగుతున్న యుద్ధములో దేవతల పక్షాన నిలబడి తన శరీరములోని వెన్నెముకను దేవతలకు ఇచ్చి దానితో వజ్రాయుధము తయారు చేసుకొని రాక్షసులను ఓడించమని కోరిన మహానుభావుడు. దేవతలు ఆ ప్రకారముగా దధీచి మహర్షి యొక్క వెన్నెముకను తీసుకొని దానితో వజ్రాయుధమును తయారు చేసుకొని దానిని రాక్షసులపై ప్రయోగించి ఇంద్రుడు విజయాన్ని సాధించినాడు.

ఈ సంఘటనను ప్రేరణగా తీసుకొని భారత ప్రభుత్వము వారు మన వీరజవానులకు మరణానంతరము "పరమ వీరచక్ర" పతకము ఇచ్చి గౌరవించుతున్నది అనే విషయమును నేను తెలుసుకొని ఒక భారతీయుడిగా గర్వపడినాను. (రెఫరెన్స్ : వికీపీడియా : పరమవీరచక్ర)

శ్రీసాయి స్వచ్ఛంద మరణము పొందిన యోగీశ్వరులు. బయిజాబాయి చేసిన సేవకు ప్రతిఫలముగా శ్రీసాయి తాత్యా మరణాన్ని స్వీకరించి, తాత్యాకు ప్రాణదానము చేసి 1918 విజయదశమినాడు మహాసమాధి చెందే సమయములో శ్రీసాయి తన భక్తులతో అన్నమాటలు "నా సమాధి మీయోగక్షేమమాలు విచారించుతుంది. నా ఎముకలు మాట్లాడుతాయి. మీ యోగ క్షేమాలు నేను నా సమాధినుండి కనిపెట్టుకొని యుంటాను." విన్న తరువాత శ్రీసాయిని కలియుగ దధీచి మహర్షి అని చెప్పడములో అతిశయోక్తి లేదు. యోగులు, మహర్షుల మహా సమాధి అనంతరము వారి ఎముకలు లోకకళ్యాణార్థము ఉపయోగపడును అని గ్రహించాను.

3 చ్యవన మహర్షి : మనము ఈనాడు ఆరోగ్యము కోసము సేవించుతున్న చ్యవనప్రాశను ఈ మహర్షి వేల సంవత్సరాల క్రితము తన ఆశ్రమములో తయారు చేసి మానవాళికి అందించినారు. ఈయన తండ్రి భృగుమహర్షి, తల్లి పులోమ. తల్లి గర్భములో నెలలు నిండకుండ ప్రమాదవశాత్తు ఈ బాహ్య ప్రపంచములోనికి రావడము చేత ఆయనకు చ్యవన అని నామకరణము చేయబడినది. ఈ మహర్షి ప్రహ్లాదునితో అన్నమాటలు "చిత్తశుద్ధి' లేని తీర్థాటన వ్యర్థము. మనస్సు నిర్మలము కావాలి అంతేకాని గంగలో మునిగిన మాత్రము లాభము లేదు. తీర్థయాత్రలలో చేసిన పాపాలు క్షమించబడవు. సర్వతీర్థ యాత్రలకంటే భూతదయ, సత్యము ముఖ్యమైనవి. ఇవి కలవారి పాదాల క్రిందనే సకల తీర్థాలు వచ్చి నివసించును.

శ్రీసాయి : దాసగణు మహరాజు గంగా యమునలలో స్నానము చేయుటకు పోదలచి బాబా అనుమతి కోరినపుడు శ్రీసాయి అంత దూరము పోనేల గంగ యమునలు ఇక్కడనే ప్రవహించుచున్నవి అని చెప్పి తన పాదాల బొటన వ్రేళ్ళనుండి గంగా యమునలను ప్రవహింపచేసెను. దాసగణు ఆ తీర్ధాన్ని తన తలపై చల్లుకొనెను.

(ఇంకా వుంది)

## శ్రీ షిరిడీ సాయి జీవిత క్యాలండరు 1938 – 1969

## (130 సంవత్సరములు)

### షిరిడీలో జరిగిన ముఖ్య సంఘటనలు – 130 సంవత్సరములు

### (నేను ఒక చరిత్రకారుడిగా సాయిబానిసగా ఈ వ్యాసాన్ని వ్రాయదలచాను)

1938 లో శ్రీసాయి జన్మించి ఉంటారని తన ఊహను హేమాద్రిపంతు శ్రీసాయి సత్ చరిత్రలో తెలియజేసారు. శ్రీ హేమాద్రిపంతు గారి వివరణ ప్రకారము – శ్రీసాయి పుట్టిన తేదీ, ఆయన తల్లిదండ్రులు, ఆయన మతము, ఆయన కులము ఎవరికి తెలియవు అని సత్ చరిత్రలో తెలుగులో శ్రీ ప్రత్తి నారాయణరావు గారు మరియు శ్రీమతి మణెమ్మ గార్లు తమ పుస్తకములలో వ్రాసియున్నారు. నేను హేమాద్రిపంతుతో ఏకీభవించుతు శ్రీసాయి సత్ చరిత్రనే ప్రామాణికంగా స్వీకరించుతున్నాను. ఈ పుస్తకములో కొంత సమాచారాన్ని నా మిత్రుడు కీర్తిశేషులు లెఫ్టినెంట్ కల్నల్ నింబాల్ కర్ పూనా వారు మరియు హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ యలమంచిలి చంద్రశేఖర్ గార్లు శ్రీసాయి జీవిత చరిత్రపై చేసిన పరిశోధనలు కూడా మీ ముందు ఉంచబోతున్నాను.

శ్రీ సాయికి తల్లిదండ్రులు ఎవరు అన్న విషయము ఈ లోకములో సరిగా ఎవరికి తెలియదు. ఈ మధ్య చాలా మంది శ్రీసాయి సత్ చరిత్రలు వ్రాస్తున్నారు. కొందరు బాబా, బ్రాహ్మణ దంపతులకు జన్మించారని వారు చనిపోతే ముస్లిమ్ దంపతులు పెంచి పెద్దచేసారని వ్రాసారు. కొందరు ఆయన జన్మ పత్రిక (జాతకచక్రం) తయారుచేసి పుస్తకాలలో ముద్రించుతున్నారు. మరియు కొందరు తమ పుస్తకాలలో బాబా తల్లిదండ్రుల పేర్లు ఈ విధంగా చెప్పారు. 1. గంగా భవాద్యుడు , దేవగిరి అమ్మ 2. నరహరి, అవంతిక, 3. నందలాలు, జమునాబాయి. కొందరు అయితే బాబా జెరూసలెమ్ లో జన్మించారు అని వ్రాసారు. ఇవి అన్నీ చదివిన తరువాత నాకు మతిపోయింది. అందుచేతనే హేమద్రిపంత్ గారు వ్రాసిన శ్రీసాయి సత్ చరిత్రనే ప్రామాణికముగా తీసుకొని ఈ విషయంలో మరికొంత వివరణ ఇవ్వదలచినాను. మన భారతీయ ఋషులలో వశిష్ట మహాముని, అగస్త్య మహామునులు అయోనిజులు కారా? అలాగే సీతామాత భూమిలో ఒక పెట్టెలో జనక మహారాజుకు దొరకలేదా? మరి అలాగే భక్త కబీరు భగీరధ నదిలో ముత్యపుచిప్పలో తమాలుకు దొరకలేదా? ఇది నా స్వంత ఆలోచన. నేను హేమాద్రిపంతు వ్రాసిన శ్రీసాయి సత్ చరిత్రనే ఆధారముగా తీసుకొని మాట్లాడుతాను.

నిజానికి మనకు ఋషి మూలం, నది మూలం అనవసరం. నదీ జలాలను త్రాగుతూ శారీరిక దప్పికను తీర్చుకొందాము. ఋషుల మాటలను ఆచరించుచు మన ఆధ్యాత్మిక దాహం తీర్చుకొందాము.

(ఇంకా ఉంది)

# సాయి ఉపాసక్ కలం నుండి 

25.12.1998 న సాయి దర్బార్ ఇంటర్ నెట్ నందు హైదరాబాద్ లో ప్రారంభింపడింది. ఈ రోజు అనగా 25.12.2017 నాడు తెలుగులో శ్రీషిరిడిసాయి వైభవమ్ ప్రారంభింపబడుతున్నందులకు ఎంతగానో సంతోషిస్తున్నాను. ఈ విధంగా విదేశాలలో ఉన్న సాయిభక్తులందరికీ తెలుగులో సాయి తత్వాన్ని ప్రచారం చేసే అదృష్టాన్ని బాబా నాకు కలిగించినందుకు ఆయనకు నా సాష్టాంగ నమస్కారాలను సమర్పించుకుంటున్నాను. ప్రస్తుతమ్ నెలకు ఒక పత్రికను సాయిబంధువులందరికీ అందజేద్దామనే ఆలోచనలో ఉన్నాను.

ఆ తరువాతనుంచి నెలకు రెండు పత్రికలను అందజేస్తూ ఉంటాను. ఈ పత్రికలో శ్రీసాయిబాబాకు సంబంధించిన లీలలు, గాధలు, The Glory of Shiridi sai (www.saidarbarusa.org) నుండి, మరియు సాయితత్వ ప్రచారంలో ప్రముఖులయిన కీర్తిశేషులు శ్రీ బి.వి.నరసింహస్వామి, మరియు శ్రీ నింబాల్కర్ గార్లు వ్రాసిన పుస్తకాలనుండి కూడా మరికొంత సమాచారాన్ని సేకరించి మీకు అందజేస్తాను..

మీ మిత్రులకు, బంధువులకు ఈ పత్రికను అందజేయదలచుకున్నచో వారి ఈ మైల్ ఐ డిలను నాకు saidarbar@gmail.com కు తెలుపగలరు..

మీ సూచనలు, సలహాలను ఇక్కడ ఇస్తున్న మైల్ చిరునామాకి పంపగలరు

saidarbar@gmail.com

ఈ పత్రిక ప్రచురణలో నాకు సహాయ సహకారాలను అందిస్తున్న శ్రీ బద్రి నరసింహన్ గారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

సాయి ఉపాసక్ - త్యాగరాజు